క్లుప్తంగా

యువత రక్తదానం



శిబిరంలో రక్తదానం చేస్తున్న యువత

సీతంపేట: స్థానిక రామాటాకీస్ ఎదురుగా ఉన్న వాయుపుత్ర హెల్త్‌క్లబ్‌లో ఆదివారం స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించారు. జాతీయ బాడీ బిల్డర్ కిలాని శ్రీనివాసు, పాత్రికేయుడు కురసాల సురేష్‌బాబు జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో 38 మంది యువత రక్తదానం చేశారు. కార్యక్రమాన్ని ముఖ్య అతిథి గాయత్రి విద్యా పరిషత్ డైరెక్టర్ డి.గిరిధర్ ప్రారంభించారు. విశాఖ జిల్లా ట్రెజరీస్ విభాగం అధ్యక్షుడు ఎం.జయకుమార్, ఫిల్మ్ డైరెక్టర్ యాడ్‌కుమార్, సిహెచ్.రవికుమార్, ఆంధ్ర బాడీ లిఫ్ట్ సంఘం అధ్యక్షుడు ఎస్.ఎస్.శివశంకర్, విశాఖ జిల్లా జిమ్ ఓనర్స్ సంక్షేమ సంఘం కార్యదర్శి కోటిరెడ్డి, ప్రధాన కార్యదర్శి పిల్లి సురేష్, రామకృష్ణ పాల్గొన్నారు. వాయుపుత్ర హెల్త్ క్లబ్ డైరెక్టర్ కిలాని గణేష్ శిబిరాన్ని పర్యవేక్షించారు.

వైద్య శిబిరానికి స్పందన భేష్



స్థానికులకు వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో వృందా ఆస్పత్రి సహకారంతో వాకర్స్ పార్కులో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు ఎస్.భానుప్రకాష్ పర్యవేక్షణలో జరిగిన ఈ శిబిరంలో డాక్టర్ అఖిల నడక వల్ల కలిగే ప్రయోజనాలను స్థానికులకు వివరించారు. ప్రతి రోజూ కనీసం అరగంట సేపు నడవాలని సూచించారు. శిబిరంలో 195 మందికి బీపీ, సుగర్ పరీక్షలు, 21 మందికి ఈసీజీ పరీక్షలు నిర్వహించారు. వాకర్స్ క్లబ్ పూర్వ అధ్యక్షుడు ఎన్.బుచ్చయ్య, కార్యదర్శి సీహెచ్ ఎస్‌వీవీ ప్రసాదరావు, ఉపాధ్యక్షురాలు విజయలక్ష్మి, సంయుక్త కార్యదర్శి ఎన్.ప్రకాశరావు, ఇతర కార్యవర్గ సభ్యులు శిబిరం నిర్వహణకు సహకరించారు.


ఏఐబీఎస్‌పీ విశాఖ అధ్యక్షుడిగా తులసీదాస్



తులసీదాస్‌ను అభినందిస్తున్న డాక్టర్ పూర్ణచంద్రరావు

సీతంపేట: ఆల్ ఇండియా బహుజన్ సమాజ్ పార్టీ(ఏఐబీఎస్‌పీ) విశాఖ అధ్యక్షుడిగా తులసీదాస్ నియమితుడయ్యారు. ఆ పార్టీ జాతీయ సమన్వయకర్త డాక్టర్ జె.పూర్ణచంద్రరావు ఆదివారం అక్కయ్యపాలెంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో తులసీదాస్‌కు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న స్థాయి నుంచి అత్యున్నత స్థాయికి చేరుకున్న వ్యక్తులే బలహీన వర్గాలను ఆదుకోవడానికి ముందుంటారని, అటువంటి వారిలో తులసీదాస్ ఒకరన్నారు. తులసీదాస్ లాంటి వారు బీసీ, ఎస్సీ, ఎస్టీల హక్కుల కోసం పోరాటాన్ని ఉధృతం చేయాలని కోరారు. పార్టీ రాష్ట్ర సమన్వయకర్త బక్కా పరంజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే మరింత గౌరవం



విద్యార్థినికి నగదు ప్రోత్సాహకం అందిస్తున్న అతిథులు, సంఘ సభ్యులు

కంచరపాలెం: విద్యతోనే ఉన్నత స్థాయి గౌరవం లభిస్తుందని జార్ఖండ్ వీసీ ఆచార్య సూరిశెట్టి జవహర్, ప్రభుత్వ విప్, పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు అన్నారు. కేంద్ర గౌరీ సేవా సంఘం అధ్యక్షుడు బుద్దా శివాజీ ఆధ్వర్యంలో ఆదివారం కంచరపాలెం ఆశీర్వాద కల్యాణ మండపంలో ఉత్తమ విద్యార్థులకు ప్రతిభా ప్రోత్సాహకాల సత్కార వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా వారు మాట్లాడుతూ కష్టపడి చదివిస్తున్న తల్లిదండ్రులతోపాటు గురువులకు గౌరవమివ్వాలన్నారు. ముందుగా గౌరీమాత చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతిప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. సుమారు 500 మంది ఉత్తమ విద్యార్థులకు అతిథుల చేతుల మీదుగా జ్ఞాపికలు, నగదు ప్రోత్సాహకాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. డాక్టర్ మళ్ల భాస్కరరావు, పీలా సుజాత, మళ్ల సురేంద్ర, బుద్ద రమేష్, రాజబాబు, దివాకర్, సంఘ సభ్యులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



శిథిలమైన షటిల్ కోర్ట్ ప్రాంగణం



పార్కులో విరిగిన ఆట పరికరాలు



నాచుపట్టిన నడక మార్గం



ఎన్‌జీజీవోస్ కాలనీలో వైభవ్ పార్కు ముఖద్వారం

పేరుకే వైభవం.. అంతా దయనీయం

ఎన్‌జీజీవోస్ కాలనీ వైభవ్ పార్కుపై నిర్లక్ష్యం

- మూలకు చేరిన ఆట పరికరాలు, డూమ్ లైట్లు
- పాడైన షటిల్ కోర్ట్, నడక దారి ఫ్లోరింగ్
- సందర్శకులు, చిన్నారుల్లో నిరాశ
- పట్టించుకోని పాలకులు, అధికారులు

మురళీనగర్: జీవీఎంసీ 49వ వార్డు మురళీనగర్ సమీపాన ఎన్‌జీజీవోస్ కాలనీలోని వైభవ్ పార్కు నిర్లక్ష్యానికి గురవుతోంది. దీని అభివృద్ధిని పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. సమీపంలోని వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయం పేరుతో ఏర్పాటు చేసిన ఈ పార్కు నిర్వహణను గాలికొదిలేసిన తీరుపై గతంలో 'సాక్షి'లో ప్రచురించిన కథనానికి నాటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పార్టీ ఉత్తర సమన్వయకర్త, ప్రస్తుత జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు సహకారంతో 49వ వార్డు కార్పొరేటర్ అల్లు శంకరరావు పార్కులో సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఈ పార్కులో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. పేరుకే వైభవం.. పార్కు లోకి వెళ్తే అంతా దయనీయంగా తయారైంది.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సౌకర్యాల కల్పన

ఎన్‌జీజీవోస్ కాలనీలో స్థానికుల కోసం కేటాయించిన మూడు వేల గజాల స్థలంలో వైభవ్ పార్కుకు ఒక రూపు తీసుకొచ్చేందుకు ఎన్‌జీజీవోస్ కాలనీ రెసిడెంట్స్ అసోసియేషన్ కృషి చేసింది. ఈ మేరకు అప్పటి ఎమ్మెల్యే తైనాల విజయకుమార్ 2012 ఏప్రిల్ 12న పార్కును ప్రారంభించారు. స్థానిక రెసిడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దీని అభివృద్ధికి చర్యలు తీసుకున్నారు. దాతల సాయంతో ప్రహరీ, కళావేదిక నిర్మించారు. జీవీఎంసీ తాగునీటి కోసం బోరు ఏర్పాటు చేసింది. అప్పటి జీవీఎంసీ కమిషనర్ బి.రామాంజనేయులు దీని అభివృద్ధికి సహకరించారు. ఆ తర్వాత ఇక్కడ ఇతర మౌలిక సదు పాయాల కల్పనకు అప్పటి టీడీపీ ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోలేదు. దీంతో దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోక వైభవ్ పార్కు నిరుపయోగంగా పడి ఉంది. ఈ విషయాన్ని తెలుసుకున్న గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పార్కులో కనీస సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకుంది. కె.కె.రాజు సహకారంతో కార్పొరేటర్ అల్లు శంకరరావు ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు నిర్వహించారు. ఓపెన్ జిమ్ పరికరాలు, 15 సిమెంటు బెంచీలు, పిల్లల ఆట పరికరాలు ఏర్పాటు చేసి పార్కు ప్రహరీని మ్యూరల్ ఆర్ట్‌తో అందంగా తీర్చిదిద్దారు. షటిల్ కోర్టు నిర్మించారు. డూమ్ లైట్లు ఏర్పాటు చేశారు. దీంతో పార్కులో సందర్శకులు పెరిగారు.



పార్కులో డూమ్ లైట్లు లేని స్తంభం..



ఫౌంటెయిన్ లేని కృష్ణభగవానుడి విగ్రహం

నేటి దుస్థితి వర్ణనాతీతం

నేడు వైభవ్ పార్కును పట్టించుకునే నాథుడు లేడు. కొత్తగా ఎటువంటి సౌకర్యాలు కల్పించకపోగా.. ఉన్న వాటి నిర్వహణకు చర్యలు తీసుకోలేదు. పిల్లల ఆట పరికరాలు, జారుడుబల్ల, రంగుల రాట్నం, తూగుటూయలలు, దాగుడుమూతల పరికరాలు, మరుగుదొడ్లు మరమ్మతులకు గురయ్యాయి. పార్కులోని 8 డూమ్ లైట్లు మూలకు చేరాయి. డూమ్స్ పూర్తిగా పోయి స్తంభాలే మిగిలాయి. సాయంత్రమైతే ఇక్కడ అంధకారం నెలకొనడంతో పార్కులోకి సందర్శకులు రావడం లేదు. దీని పరిశుభ్రతకు జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. షటిల్ కోర్టు ఫ్లోర్ పూర్తిగా పాడైంది. పార్కులో కృష్ణభగవానుడికి ఏర్పాటు చేసిన వాటర్ ఫౌంటెయిన్ పనిచేయడం లేదు. భూగర్భ విద్యుత్ కేబుల్ లైన్ దెబ్బతింది. జంగిల్ క్లియరెన్స్‌కు ఎటువంటి చర్యలు లేవు. దీంతో విషపురుగులు పార్కులోకి ప్రవేశించడంతో సందర్శకులు రావడం మానేశారు. నడక దారి ఫ్లోరింగ్ పాడై నాచుపట్టడంతో వాకర్స్ ప్రమాదాల పాలవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వైభవ్ పార్కులో సమస్యలు పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

అధికారులకు విన్నవించాం



పార్కులో ముఖ్యంగా విద్యుత్ లైట్లు లేకపోవడం వల్ల అంధకారం నెలకొంటోంది. వీటికి సంబంధించిన కేబుల్ లైన్ పూర్తిగా ధ్వంసమైంది. వీటిని పునరుద్ధరిస్తేనే సందర్శకుల ఆదరణ లభిస్తుంది. పార్కులో నెలకొన్న సమస్యలపై మేయర్ పీలా శ్రీనివాసరావు, జీవీఎంసీ కమిషనర్‌ల దృష్టికి తీసుకొచ్చాం. దీనిపై అధికారులు తక్షణం స్పందించాల్సి ఉంది. పిల్లల ఆట పరికరాలతో పాటు షటిల్ కోర్ట్ ఫ్లోరింగ్ నిర్మించి, ఫౌంటెయిన్‌లను పునరుద్ధరిస్తే పార్కు ఆకర్షణీయంగా తయారవుతుంది.

– కె.రామచంద్రరాజు, పార్కు కార్యదర్శి

సీతమ్మధార ట్రెజరీలో తప్పుడు బిల్లుపై స్పందన

- ఏటీవోకు మెమో జారీ
- బిల్లు వెనక్కి పంపిన డీటీవో

సాక్షి ఎఫెక్ట్..

మహారాణిపేట: సీతమ్మధార ట్రెజరీలో తప్పుడు బిల్లుల బాగోతంపై స్పందన లభించింది. దీనిపై తక్షణం వివరణ ఇవ్వాలని జిల్లా ట్రెజరీ అధికారి (డీటీవో) వై.సుధాకరరావు సీతమ్మధార అసిస్టెంట్ ట్రెజరీ అధికారి గోవిందరావుకు మెమో పంపారు. ఇదే కార్యాలయంలో ప్రభుత్వ కాలేజీలో లెక్చరర్‌గా పనిచేసి పదవీ విరమణ చేసిన ఈశ్వర వర్మ ఎరియర్స్ బిల్లుల్లో తప్పుడు లెక్కలు చూపించినట్టు 'సాక్షి'లో కథనం ప్రచురితమైన సంగతి విదితమే. దీనిపై ట్రెజరీ అండ్ అకౌంటెంట్ శాఖ డైరెక్టర్ మోహనరావు మౌఖిక ఆదేశాల మేరకు డీటీవో సుధాకరరావు మెమో జారీ చేశారు. అలాగే బిల్లును కూడా వెనక్కి పంపినట్టు డీటీవో వై.సుధాకరరావు ఆదివారం సాక్షికి తెలిపారు. దీనిపై సమగ్ర విచారణ చేయాలని డీటీవో కోరారు. ఈ ఘటనలో డైరెక్టర్ పేరు వాడిన బిల్లును త్వరిత గతిని పూర్తి చేయడానికి ప్రయత్నాలు జరినట్టు భోగట్టా. ఈ సంఘటనను మసిపూసి మారేడు కాయ చేయడానికి గట్టి ప్రయత్నాలు జరుగుతున్నాయి. గతంలో ఇలాంటి సంఘటనలో ఒక ఉద్యోగికి రెండు ఇంక్రిమెంట్లు కట్ చేసి క్రమశిక్షణ చర్యలు తీసుకున్నారు. ఇప్పుడు ఏం జరుగుతుందో అని అంతా ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు.

మంచిగా మెలగండి



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఎస్‌ఐ చిన్నంనాయుడు

తాటిచెట్లపాలెం: రౌడీషీటర్లు ఎటువంటి గొడవల్లో తలదూర్చకుండా సత్ప్రవర్తనతో మెలగాలని ఫోర్త్ టౌన్ పీఎస్ ఎస్‌ఐ చిన్నంనాయుడు సూచించారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీషీటర్లకు ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. రౌడీ షీటర్లు నేర ప్రవృత్తిని వీడి మంచిగా నడుచుకోవాలన్నారు. హద్దులు మీరితే ఉపేక్షించేది లేదని ఎస్‌ఐ హెచ్చరించారు.

హామీల అమలులో 'కూటమి' విఫలం

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు
- 46, 55 వార్డుల్లో 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ'

కంచరపాలెం: కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో ప్రజా వ్యతిరేకత తీవ్రంగా ఉందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. 46వ వార్డు తాటిచెట్లపాలెం శాంతినగర్ కమ్యూనిటీ హాల్‌లో పార్టీ వార్డు అధ్యక్షుడు బలిరెడ్డి గోవింద్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ సమావేశంలో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడారు. తాము అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ హామీలు అమలు చేస్తామని చెప్పిన కూటమి నాయకులు ఏడాది పాలనలో ఏవీ అమలు చేయలేక విఫలమయ్యారన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేయకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు చేస్తున్న మోసాలను, రెడ్‌బుక్ రాజ్యాంగ అరాచకాలను ప్రజలకు తెలియజేసి వారిని చైతన్య పరచాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గత ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రజలకు ఎంతో లబ్ధి చేకూర్చి.. ఇచ్చిన హామీల కంటే ఎక్కువ సంక్షేమ పథకాలు అందజేసి గర్వంగా గడపగడపకు వెళ్లి చెప్పుకున్నామన్నారు. కూటమి ప్రభుత్వం మాత్రం ఏ పనీ చేయకపోయినా.. ఎంతో చేశామని చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. అనంతరం బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కరపత్రాలను నాయకులతో కలిసి కె.కె.రాజు ఆవిష్కరించి కార్యకర్తలకు అందజేశారు. డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, మాజీ కార్పొరేటర్లు ఎస్.అప్పారావు, పి.బాట్జీ, డి.నర్సింగరావు, కె.చిన్నా, లావణ్య, బి.రాజు, శ్రీను, ఈశ్వరరావు, రామారావు, సీతయ్యరెడ్డి, అప్పిరెడ్డి, జి.అప్పారావు, దుర్గాభవాని, రమణ, వార్డు శ్రేణులు, బూత్ కన్వీనర్లు పాల్గొన్నారు.



46వ వార్డులో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు, నాయకులు

కూటమి పాలనంతా నయవంచనే..

కూటమి ప్రభుత్వ పాలన అంతా నయవంచనేనని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు అన్నారు. 55వ వార్డు కంచరపాలెం ధర్మానగర్ కమ్యూనిటీ హాల్‌లో కార్పొరేటర్ శశికళ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ సమావేశంలో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడారు. ఇచ్చిన హామీలు అమలు చేయలేక.. కూటమి నాయకులు ప్రజల్లోకి వెళ్లాలంటేనే భయపడుతున్నారన్నారు. అధికారం ఉన్నా.. లేకపోయినా వైఎస్సార్‌సీపీ ప్రజాపక్షమేనని తెలిపారు. అనంతరం బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సేనాపతి అప్పారావు, దుప్పలపూడి శ్రీనివాస్, గంగామహేష్, బద్రి, చిన్నారావు, వై.శ్రీనివాస్, గంటా కామరాజు, సంతోష్, ఆళ్ల గోపి, శ్రీనివాస్‌రెడ్డి, పోలరావు, ధర్మేంద్ర రెడ్డి, శ్రీకాంత్, విమలకుమార్, నాగలక్ష్మి, రాధ, సుశీల, దివాకర్, వార్డు కార్యకర్తలు, బూత్ కన్వీనర్లు, సభ్యులు పాల్గొన్నారు.



55వ వార్డులో బాబు మోసాలను తెలిపే స్కానర్ కరపత్రాన్ని చూపిస్తున్న కె.కె.రాజు

గాయని రాధకు విశాఖ చిత్ర బిరుదు ప్రదానం

సీతంపేట: ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో సినీ నేపథ్య గాయని చిత్ర జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నగరానికి చెందిన గాయని, ఉపాధ్యాయురాలు జి.కె.రాధను విశాఖ చిత్ర బిరుదుతో సత్కరించారు. గాయని రాధకు సినీ నేపథ్య గాయని చిత్ర పేరిట బిరుదు ప్రదానం చేయడం అభినందనీయమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డాక్టర్ సుహాసిని ఆనంద్ అన్నారు. వివిధ భాషల్లో 25 వేలకు పైగా పాటలు పాడి జాతీయ స్థాయి అవార్డు పొందిన చిత్ర పేరిట బిరుదు అందుకోవడం గొప్పవిషయమని కొనియాడారు. ఘంటసాల స్మారక కళా పీఠం అధ్యక్షుడు గ్రంధి విష్ణుమూర్తి మాట్లాడుతూ సాంస్కృతిక రాజధానిగా ఖ్యాతి గాంచిన విశాఖలో కళలు, కళాకారులను గుర్తించి ప్రోత్సహించడం హర్షణీయమన్నారు. అనంతరం జరిగిన సంగీత విభావరిలో గాయనీ గాయకులు జి.కె.రాధ, విశ్వప్రసాద్, కోమలి, దేవరాజ్, సాత్విక, మనోహర్ ,శైలజ, సత్య, అనూష, రమేష్‌కుమార్, మురళీధర్ తదితరులు చిత్ర పాడిన పాటలు ఆలపించి అలరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కందుల నాగరాజు, సంఘ సేవకుడు తోట ముకుంద్, ఉపకార్ ట్రస్టు మేనేజర్ సుధీర్, ఘంటసాల కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక కార్యదర్శి చెన్నా తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.



గాయని రాధను విశాఖ చిత్ర బిరుదుతో సత్కరిస్తున్న సుహాసిని ఆనంద్

బీసీ సంక్షేమ సంఘంలో నియామకాలు

సీతంపేట: జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర జిల్లాల కమిటీలో చురుగ్గా పనిచేస్తున్న పలువురికి వివిధ హోదాల్లో నియామక పత్రాలు అందజేశారు. సంఘ ఉత్తరాంధ్ర జోన్ ఇన్‌చార్జి దాడి అన్నపూర్ణ ఆధ్వర్యంలో ఆదివారం అక్కయ్యపాలెంలో జరిగిన సమావేశంలో కొత్తగా నియమితులైన వారికి ముఖ్య అతిథులు సంఘ రాష్ట్ర అధ్యక్షుడు వనమాల శ్రీనివాసరావు, రాష్ట్ర ప్రచార కమిటీ అధ్యక్షుడు రేవు శ్రీనివాసరావు చేతుల మీదుగా నియామక పత్రాలు అందించారు. రాష్ట్ర ఉపాధ్యక్షులుగా పోతిన పైడిరాజు, సనపల రామకృష్ణ, తన్నీరు ఉమామహేశ్వరరావు, జాతీయ కార్యదర్శిగా కిలపర్తి సత్యనారాయణ, రాష్ట్ర కార్యదర్శిగా బగాది శ్యామల, విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పోతిన ప్రసాద్, ఉత్తరాంధ్ర జోన్ మీడియా కో ఆర్డినేటర్‌గా కొత్తల అరుణ్ ప్రసాద్ నియామక పత్రాలు అందుకున్నారు.



నియామక పత్రాలు అందుకున్న వారితో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావు

ఇరుకు రోడ్డులో ఇబ్బందికరంగా పార్కింగ్



- లలితా పీఠం రహదారిలో ఇరువైపులా వాహనాల నిలిపివేత
- ఫిర్యాదులు పట్టించుకోని ట్రాఫిక్ పోలీసులు

సీతంపేట: జీవీఎంసీ 26వ వార్డు లలితానగర్‌లోని లలితా పీఠానికి వెళ్లే మార్గంలో రోడ్డుకు ఇరువైపులా కార్లు, ద్విచక్ర వాహనాలను ఇష్టానుసారంగా పార్కింగ్ చేస్తున్నారు. నిత్యం ఇళ్ల ముందు వాహనాలు నిలిపి ఉంచడంతో నివాసులు ఇబ్బందులు పడుతున్నారు. స్థానికులతోపాటు ఇతరుల వాహనాల రాకపోకలు కష్టతరంగా సాగుతున్నాయి. లలితా పీఠానికి వచ్చే భక్తులు కొంత మంది ఉదయం అక్కడ పార్క్‌చేసిన కార్లను సాయంత్రం వరకు తీయడం లేదు. ఈ మార్గం ఇరుకు రోడ్డు కావడంతో వాహనాల పార్క్‌చేసి వదిలేయడం వల్ల తరచూ ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఈ సమస్య పరిష్కరించాలని ఫోర్త్‌టౌన్ పోలీసులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా.. పట్టించుకోడవం లేదని స్థానికులు చెబుతున్నారు. ట్రాఫిక్ పోలీసులు తక్షణం స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



లలితానగర్ లలితా పీఠం రోడ్డులో పార్క్‌చేసిన వాహనాలు

వైభవంగా రుక్మిణి కల్యాణం

మద్దిలపాలెం: త్యాగరాజ ఆరాధన ట్రస్ట్, నారాయణ తీర్థం తరంగిణి సంయుక్తంగా రుక్మిణి కల్యాణాన్ని మద్దిలపాలెం కళాభారతిలో ఆదివారం వైభవంగా నిర్వహించారు. తిరుపతి నుంచి వచ్చిన కంకణాలతో స్వామికి, అమ్మవారికి కంకణధారణ చేసి భక్తులందరికీ అందించారు. జీలకర్ర బెల్లం, మంగళ సూత్రధారణ, ముత్యాల తలంబ్రాలు, మంత్రపుష్పం, మంగళహారతి తర్వాత భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. 780 మందికి పెళ్లి భోజనం పెట్టారు. అధ్యక్షులు మంతెన సత్యనారాయణ రాజు, కార్యదర్శి రాంబాబు పాల్గొన్నారు.

జానపద కళలు వారసత్వ సంపద

సీతంపేట: ఆధ్యాత్మిక ప్రవచన కర్త రామకృష్ణానందకు 'ప్రవచన వాచస్పతి', గేయ రచయిత ఐనాడ దుర్గాప్రసాద్‌కు 'జన కవి' బిరుదులు ప్రదానోత్సవం ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఘనంగా జరిగింది. శ్రీమాతా కళాపీఠం ఆధ్వర్యంలో, విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య అధ్యక్షతన జరిగిన ఈ సభలో ముఖ్య అతిథి వ్యాపారవేత్త యార్లగడ్డ వెంకన్న చౌదరి చేతుల మీదుగా బిరుదులు ప్రదానం చేసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాకారులను గుర్తించి వారి కళలకు ప్రాచుర్యం అందించిన ఘనత శ్రీమాతా కళాపీఠానికే దక్కిందన్నారు. కమిషనర్ నల్లనయ్య మాట్లాడుతూ జానపద కళలు మన వారసత్వమని, వాటిని కాపాడుకోవడం మన కర్తవ్యమని, అందులో భాగంగా ఈ సన్మాన కార్యక్రమం చేస్తున్న శ్రీమాతా కళాపీఠం అధినేతలను కొనియాడారు. రామకృష్ణానంద ప్రవచన కర్తగా తన వాగ్ధాటితో ప్రజలలో ధర్మ, నిర్మలత్వం, నైతికతను పెంపొందిస్తున్నారన్నారు. దుర్గాప్రసాద్ ఐనాడ తన రచనలతో పండిత పామర రంజితంగా సామాజిక సమస్యలపై పాటలు రాసి సమాజ చైతన్యానికి కృషి చేస్తున్నరని ప్రశంసించారు. కార్యక్రమంలో శ్రీరామనారాయణం టెంపుల్ చైర్మన్ ఎన్‌సీఎస్‌ఈ శ్రీనివాస్, పాడేరు ఎంపీడీవో కుసుమ హర రమేష్, శ్రీమాతా అధినేతలు బి.ఎన్.మూర్తి, పి.నాగభూషణరావు పాల్గొన్నారు.



రామకృష్ణానంద, దుర్గాప్రసాద్‌లను సత్కరిస్తున్న వెంకన్న చౌదరి

ఆకట్టుకున్న 'బుద్ధునితో నా ప్రయాణం'

సీతంపేట: బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో రామాటాకీస్ రోడ్డులోని అంబేద్కర్ భవన్‌లో ఆదివారం 'బుద్ధునితో నా ప్రయాణం' తెలుగు నాటకాన్ని ప్రదర్శించారు. దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, రైటర్స్ అకాడమీ చైర్మన్ వి.వి.రమణమూర్తి, కార్పొరేటర్ గంగారావు కార్యక్రమాన్ని ప్రారంభించారు. హైదరాబాద్ అభ్యుదయం అకాడమీకి చెందిన 40 మంది కళాకారులు నాటకాన్ని అద్భుతంగా ప్రదర్శించారు. దుఃఖం, పేదరికం, హింసకు మూలాలు, వాటికి విముక్తి మార్గాలు, బుద్ధుడి సందేశం, జీవిత చరిత్ర, బుద్ధిజం భారతదేశానికి ఎందుకు అవసరం, అంబేద్కర్ ఆలోచనలను చక్కగా ప్రదర్శించి ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ అంబేద్కర్ మెమోరియల్ సొసైటీకి భారత రాజ్యాంగం ఒరిజనల్ ప్రతిని బహూకరించారు. కార్యక్రమంలో బొడ్డు కల్యాణరావు, జె.వి.ప్రభాకర్, బత్తుల గౌతంబాబు పాల్గొన్నారు.



అంబేద్కర్ భవన్‌లో బుద్ధునితో నా ప్రయాణం నాటకాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు